


భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 5: భూకబ్జాకు సంబంధించిన కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని కొత్త రాజిరెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించి, దౌర్జన్యం, బెదిరింపులకు పాల్పడిన కేసులో ముగ్గురిపై డిసెంబరు 24న కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ3గా ఉన్న భగత్‌నగర్‌కు చెందిన వ్యాపారి నిమ్మశెట్టి స్వామి అలియాస్ శ్యాంను సోమవారం అరెస్టు చేశారు. అనంతరం స్వామిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి పల్లెల్లో పారిశుధ్య పనులు

- వారంరోజుల పాటు స్పెషల్ డ్రైవ్
- ప్రతి శుక్రవారం 'డ్రై డే'



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు వారం రోజుల పాటుస్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం నుంచి గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజులపాటు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో రోడ్లను శుభ్రం చేస్తారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలను శుభ్రం చేస్తారు. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లోని అవాంఛిత, పిచ్చి మొక్కలను తొలగించడం, ఖాళీ ప్లాట్లను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపడతారు. గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్లు, బస్టాప్‌లు, ఇతర ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేస్తారు. పాడుబడిన, నిరుపయోగంగా ఉన్న బోరుబావులు, బావులను పడుస్తారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం, నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపడతారు.

● మంచినీటి వనురుల శుభ్రం

గ్రామాల్లోని మంచినీటి వనరులను పరిశీలించి రిజర్వాయర్లు, ట్యాంకులను శుభ్రం చేస్తారు. పైప్‌లైన్ల లీకేజీలను మరమ్మత్తు చేసి, క్లోరినేషన్ చేస్తారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో విధిగా డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టి పరిశుభ్రత, పచ్చదనం వంటి కార్యక్రమాలను ప్రతి ఇంట్లో చేపట్టే విధంగా ప్రజలను భాగస్వాములను చేస్తారు. వారంరోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన తర్వాత 15వ తేదీన ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి మద్యం, మాదక ద్రవ్యాలు, సామాజిక దురాచారాలపై ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలివ్వడంతో మండల, గ్రామాల అధికారులు ప్రత్యేక పారిశుధ్యం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తెలంగాణను ఎడారి చేస్తే ఊర్కొనేది లేదు

- సాగు, తాగునీటితోపాటు సమస్యలపై పోరాడుదాం
- కాంగ్రెస్, బీజేపీల కుట్రలను ఎండగడదాం
- వంద రోజుల తర్వాత సత్తా చూపుదాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5: తెలంగాణను ఏడారి చేస్తే ఊర్కొనేది లేదని, రైతాంగ సమస్యలపై సమష్టిగా పోరాడుదామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్‌ఎస్ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గంగుల కమలాకర్ కోరారు. కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ఎండగట్టి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకోవలసిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే అప్పుడే కష్టాలు మొదలయ్యాయని, కరెంటు కోతలు, నీటి కటకటలు, సాగునీరు లేక గోసపడుతున్నారని విమర్శించారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం కావాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. వంద రోజుల తర్వాత హామీల అమలు కోసం బరిగీసి కొట్లాడుతామని స్పష్టం చేశారు.

● సీఎం రేవంత్‌రెడ్డి మాటలు దుర్మార్గం

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సీఎం రేవంత్‌రెడ్డి సీఎం పదవికి మచ్చతెచ్చేలా మాట్లాడడం దుర్మార్గమని, మాజీ సీఎం కేసీఆర్‌పై రండ అని వాడిన పదజాలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇలాంటి భాషను వాడలేదని గుర్తు చేశారు. పార్టీల మధ్య విమర్శలు ఉండాలే కానీ ఇలాంటి విమర్శలు తప్పని ఖండించారు. పార్లమెంట్ ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు అవసరం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. 14 ఏళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ళ కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత హైదరాబాద్‌కే పరిమితమయ్యాడని, ఐదేళ్ళలో ఆయన ఐదు కొత్తల నిధులు నియోజకవర్గానికి తీసుకురాలేదని విమర్శించారు. ఐదేళ్లలో ఎన్ని ఊర్లు తిరిగాడో సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే బండి సంజయ్ లోకల్.. నాన్ లోకల్ ఫీలింగ్ తెస్తున్నాడని, తాను కూడా కరీంనగర్ గడ్డపైనే పుట్టినవాడినని వినోద్‌కుమార్ తెలిపారు. ఎంపీగా తానుఐదేళ్ళలో ఏమి చేశానో, ఐదేళ్లలో బండి సంజయ్ ఏమి అభివృద్ధి చేశాడో అంకెలతో సహా చెప్పేందుకు సిద్ధమని సవాల్ చేశారు. బండి సంజయ్ రాముడిని రాజకీయంగా వాడుకుంటున్న తీరును ప్రజలు గమనించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలనే బీజేపీ చేస్తున్న కుట్రలను పటాపంచలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల నిజస్వరూపాన్ని ప్రజాక్షేత్రంలో బట్టబయలు చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్, ఎంపీపీలు పిల్లి శ్రీలత, లక్ష్మయ్య, జడ్పీటీసీలు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు గుర్తింపు ఏది?

● నేతలను నిలదీసిన నాయకుడు



నేతలను నిలదీస్తున్న కార్యకర్త

పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను అధిష్టానం గుర్తింపు ఇవ్వక పోవడం వల్లనే బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోయింది.. పార్టీలో కార్యకర్తలకు గుర్తింపు ఎక్కడ ఉంది... అంటూ కామారపు శ్యామ్ అనే నాయకుడు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి ప్రసంగిస్తున్న సమయంలో నిలబడి మాట్లాడటంతో ఒక్కసారిగా సమావేశంలో రసభసా నెలకొన్నది. ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలంటూ ఇప్పుడు కార్యకర్తలను అడుగుతున్నారని, అధికారంలో ఉండగా ఎందుకు పట్టించుకోలేదంటూ ఆయన నేతలను నిలదీశారు. ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్‌తోపాటు పార్టీనేతలంతా ఈ సమావేశంలో మాట్లాడటం సరికాదంటూ పదేపదే చెప్పినప్పటికి ఆయన వినలేదు. దీంతో నాయకులు, కార్యకర్తలు లేవడం... ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దళితబంధులో నీకు 10 లక్షలు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. నాకు కాదు.. కార్యకర్తలందరికీ ఏమి చేశారంటూ ఆయన ప్రశ్నించడంతో కొద్దిసేపు రసభసా జరిగింది.

చొప్పదండి ఎమ్మెల్యే తొలి వేతనం.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

● రూ. 1.5 లక్షల చెక్కు కలెక్టర్‌కు అందజేత



కలెక్టర్ కు చెక్ అందిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 5: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఉండే విధంగా చొప్పదండి ఎమ్మెల్యే తన మొదటి నెల వేతనం నుంచి 1.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం పూట అల్పాహారం అందించేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ శాతం పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలవారే ఉంటారన్నారు. సాయంత్రం పూట నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులలో వారి ఆకలి తీర్చాలని విరాళం అందజేశానన్నారు. తన బాల్యంలో ఇటువంటి ఇబ్బందులు ఎన్నో ఎదుర్కొన్నానని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చొప్పదండి మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 256 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేల సత్పతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5: ప్రజావాణి కార్యక్రమానికి 256 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దర ఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తుల్లో కరీంనగర్ మున్సిపాలిటీ-28, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ-5, పోలీసు కమిషనర్-11, జిల్లా పంచాతి అధికారి-21, కరీంనగర్ రూరల్ తహసీల్దార్-16, ఇతర శాఖలకు సంబందించినవి 189, మొత్తం 256 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల వేతనం ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5: మున్సిపల్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు 21 వేల రూపాయల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనికి భద్రత లేదని, ఎలాంటి రక్షణ సదుపాయాలు లేవన్నారు. ప్రమాదం జరిగితే ప్రమాద బీమా కాని, నష్టపరిహారం కాని చెల్లించడం లేదన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు ప్రమాద బీమా, రక్షణ సౌకర్యాలు చేపడతామని హామీ ఇచ్చిందని, వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఆసోద రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపెల్లి పోచయ్య, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, హుజురాబాద్ అధ్యక్షుడు ఎండీ అజ్జు, కొత్తపల్లి అధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆమె నగరంలోని సప్తగిరికాలనీ, కోతిరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రోజుకో సబ్జెక్టులో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఏడురోజులపాటు అల్పాహారాన్ని అందించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనశాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, జిల్లా విద్యాధికారి జనార్దన్, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు అద్దాల బ్లాక్‌ఫిల్మ్‌పై స్పెషల్ డ్రైవ్



కారుపై ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న పోలీసులు

● 50 వాహనాలకు జరిమానా

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 5: కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా కారు అద్దాలకున్న బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు నగరంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. బ్లాక్‌ఫిల్మ్ ఉన్న 50 కార్లను పట్టుకున్నారు. ఈ కార్ల యజమానులకు ఈ చలాన్ ద్వారా జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ సర్వర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రతా చర్యల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగిస్తు న్నామన్నారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. ఏ కారులో కూడా బ్లాక్‌ఫిల్మ్‌ను వాడవద్దన్నారు. ఇప్పటికే అతికించిన బ్లాక్ ఫిల్మ్‌ను కారు యజ మానులు స్వయంగా తొలగించుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు పర్శ రమేష్, కరీముల్లాఖాన్, ఎస్‌ఐలు ఇషాక్, శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలుగునూర్ ప్రజల బాధలు తీరేనా?

- పెరిగిన ఇంటి పన్నుల భారం
- కనీస వసతులు లేక ఇబ్బందులు



అధ్వానంగా ఉన్న రోడ్డు



రోడ్డుపై మురికినీరు

తిమ్మాపూర్, జనవరి 4: గ్రామ పంచాయితీగా ఉన్న అలుగునూర్‌ను కరీంనగర్‌లో కార్పొరేషన్‌లో విలీనం చేసిన అభివృద్ధి పరుగులు పెడుతుందని ఇక్కడి ప్రజలు భావించారు. కాని పరిస్థితి ఇందుకు విరుద్ధంగా మారింది. 2019 జూన్‌లో కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం అయి ఎనిమిదో డివిజన్‌గా ఏర్పడింది. అప్పటి పాలకులు అలుగునూర్‌ను కార్పొరేషన్‌లో విలీనం చేస్తే అభివృద్ధి జరుతుందని, మూడు సంవత్సరాల వరకు గ్రామ పంచాయితీకి కట్టే పన్నులే నగర పాలక సంస్థకు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి మాట దేవుడెరుగు.. ప్రజలపై ఆస్తి పన్నుల భారం పడింది. గతంలో ఏడాదికి వెయ్యి రూపాయల ఇంటి పన్ను కట్టినవారు ప్రస్తుతం పదివేల రూపాయల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇళ్లతోపాటు ఖాళీ స్థలాన్ని పరిగణలోకి తీసుకుని పన్నులు వేస్తున్నారు. దీంతో భారీగా పెరిగిన పన్నులు కట్టలేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

● అధ్వానంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు

రాజీవ్ రహదారికి అనుకుని ఉన్న అలుగునూర్ కార్పొరేషన్‌లో విలీనం జరిగి ఏళ్లు గడిచినా ఆశించినంత అభివృద్ధి జరగలేదు. శివారు కాలనీలవైపు అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కాని కన్నెత్తి చూడడం లేదు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలం వస్తే మరింత ఇబ్బందికరంగా ఉటుంది. ఇరుకైన మట్టి రోడ్లు, వర్షపు నీరు, ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటితో బయటకు రాని పరిస్థితి ఏర్పడుతుంది.

● శివారు కాలనీలను పట్టించుకునే నాథుడు కరువు

అలుగునూర్ గ్రామ పంచాయితీలో భాగంగా ఉన్న శివారు కాలనీలను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కార్పొరేషన్‌లో విలీ నం అయిన తరువాత అభివృద్ధి జరుగుతుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. అలుగునూర్ శివారు కాలనీలను కలిపి గ్రామ పంచాయితీ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఇంటి పన్ను పెరిగింది

- ఎం.శంకర్, అలుగునూర్ శివారు కాలనీవాసి




అలుగునూర్ శివారు కాలనీలోని మానేరు నగర్‌లో నాలుగు గుంటల స్థలంలో ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నాం. నేను రిటైర్డ్ ఉద్యోగిని. గ్రామ పంచాయితీగా ఉన్నప్పుడు సంవత్సరానికి 700 రూపాయల ఇంటి పన్ను వచ్చేది. కార్పొరేషన్‌లో విలీనం అయిన తరువాత ఇంటి పన్ను 11,300 రూపాయలకు పెరిగింది. 30 రూపాయలు వచ్చే నల్లాబిలు 1800కు పెరిగింది. -

రోడ్లు, డ్రైనేజీలు లేవు

- పి మల్లేశం, మానేరునగర్



నేను చిన్న ఉద్యోగం చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రెండున్నర గుంటల స్థలంలో ఇల్లు నిర్మించుకున్న. ఇంటి పన్ను రెండువేలకు పైగా వచ్చింది. చాలీ చాలని జీతాలతో పని చేసే మేము అంత పన్నులు ఎలా చెల్లించాలి. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేవు. వర్షాలు పడితే ఇంటి నుంచి వెళ్లలేని పరిస్థితి ఉది. గుంతల రోడ్లు, మురికి నీరు రోడ్లపైనే ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్ని సార్లు ప్రజాప్రతినిధులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.



ఎలుగుబంటి దాడి ఘటనపై అధికారుల ఆరా

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 5: ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఈ నెల 4న ఎలుగుబంటి దాడి చేసిన సంఘటనలో అదే తండాకు చెందిన రైతు గుగులోతు హరిలాల్ తీవ్రగాయాల పాలైన విషయం విధితమే. సోమవారం రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల అటవీ శాఖ అధికారులు ఘటనపై ఆరా తీశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని అటవీ శాఖ అధికారులు దేవునిగుట్టతండా శివారు అటవీ ప్రాంతంలో పరిశీలించారు. ఎలుగుబంటి దాడి చేసినట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో పక్కనే ఉన్న కామారెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారులకు ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రావు సమాచారం అందించారు. దాంతో ఆ జిల్లాకు సంబంధించిన అధికారులు చేరుకోవడంతో వారితో కలిసి మాచారెడ్డి మండలం సోమారిపేట, బంజేపల్లి తదితర అటవీ గ్రామాల్లో ఆరా తీశారు. పూర్తి స్థాయిలో విచారించగా దాడికి గురైన హరిలాల్‌ను మాచారెడ్డి మండలానికి చెందిన 108 వాహనంలో రెండు జిల్లాల సరిహద్దు నుంచి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని వాహన సిబ్బంది పేర్కొన్నారని ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్ రావు వివరించారు. గొల్లపల్లి, వీర్నపల్లి ఎఫ్ఎస్‌వోలు సాకారం, రంజిత్‌కుమార్, ఎఫ్‌బీవోలు, మాచారెడ్డి మండల అటవీ శాఖ అధికారులు ఉన్నారు.

నాటు బాంబులు పేలడమే కారణమా?

దేవునిగుట్టతండాలో రైతు గుగులోతు హరిలాల్‌పై ఎలుగుబంటి దాడిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హరిలాల్‌తో పాటు మరో ఇద్దరు కలిసి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంజేపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లి నాటు బాంబులను అమర్చుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు పేలడంతో ఘటన చోటు చేసుకుందని వినవస్తున్నాయి. హరిలాల్‌తో పాటు మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని సమాచారం. గుట్టు చప్పుడు కాకుండా మాచారెడ్డి మండలానికి చెందిన 108 వాహనంలో ఎలుగుబంటి దాడి చేసిందని పేర్కొంటూ హరిలాల్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిసింది. మరో ఇద్దరిని కామారెడ్డికి తీసుకెళ్లినట్లు సమాచారం. హరిలాల్ పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలుస్తోంది. దీనిపై సిరిసిల్ల ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రావు వివరణ కోరగా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 5: రాజస్థాన్‌లో ఈ నెల 7 నుంచి 11 వరకు జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గత నెల 28న జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు జైనపురం త్రిష, జక్కుల తేజశ్విని, గుంతకాల యశ్వంత్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెడ్డవేని మధు, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహి పాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి పెటాటీఎస్ అధ్యక్ష,కార్యదర్శులు ఎ శ్రీనివాస్, ఎండి యూనుస్ పాష, డీవైఎస్‌ఓ కీర్తి రాజవీరు, హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి కలిగేటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెట్టిపల్లి అశోక్, బాధ్యులు వి రాజేందర్, ఐ శ్రీనివాస్, వి రాజ్‌కుమార్, భాస్కర్, అనూప్‌రెడ్డి, వీర్ పాల్ తదితరులు అభినందించారు.




హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

● కట్నం వేధింపులని తల్లిదండ్రుల ఫిర్యాదు


గంగాధర, ఫిబ్రవరి 5: గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన ఏగుర్ల స్వప్న(27) గత నెల 29న ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లికి చెందిన స్వప్నను గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన ఏగుర్ల కుమార్‌తో 2018లో వివాహం జరిపించారు. స్వప్నకు కుమారుడు, కుతురు జన్మించిన తరువాత సంవత్సరం నుంచి అదనపు కట్నంతో పాటు ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటూ కుమార్ వేధిస్తుండేవాడు. దీనిపై స్వప్న తల్లిదండ్రులు హిమ్మత్‌నగర్‌లో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి కుమార్‌కు 2.30లక్షలు ఇచ్చారు. కొన్ని రోజుల కాపురం సజావుగా సాగినా మళ్లీ ఎకరం భూమి కావాలంటూ భర్త కుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు వేధింపులకు గురిచేయగా మనస్థాపంతో జనవరి 29న ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించి స్వప్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమ వారం మృతి చెందింది. స్వప్న తల్లి సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.













బిట్‌కాయిన్ పేరుతో మోసం

వీణవంక ఫిబ్రవరి5: మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన వడ్లూరి రాజు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే అధిక డబ్బులు వస్తాయని ఆశపడి దాదాపు లక్ష ఏడు వేల రూపాయలు మోసపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జనవరి 6వ తేదీన అమిటల్ మార్కెటింగ్ కంపెనీలో జాబ్ ఉన్నదని మొదట కొంత డబ్బులు పెట్టుబడిగా పెట్టాలని అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ మెసెజ్ వచ్చింది. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని తప్పుడు సంకేతాలు ఇచ్చి 1,07,000 రూపాయలు కాజేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రాజు పేర్కొన్నాడు.



ఎట్లుండె నా పల్లె..

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో తేలిన అనంతగిరి

- కూలిన ఇళ్లను చూసి తమ అనుబంధాలు గుర్తు చేసుకుంటున్న నిర్వాసితులు
- అన్నంపెట్టిన ఊరును విడిచి అష్టకష్టాలు పడుతున్నామంటూ ఆవేదన

'ప్రాజెక్టుల నీళ్లు తగ్గినయి.. మన ఊరు తేలిందంటే ఇట్ల వచ్చినం.. అగో చూడు.. మన పంచాయతీ ఆఫీసు.. అట్లనే ఉంది.. పాట్లోల్ల చింత చూడు.. నీళ్లలో ఉన్నా.. ఎండినా.. అప్పటి తీరుగనే నిలబడి ఉంది.. హనుమండ్ల గుడి చూడు.. దేవుడు లేకపోయినా ఇంకా మంచిగనే ఉంది.. మన ఇండ్లన్నీ ఏమైపాయె.. ఎవళ కోసమో మనం పుట్టి పెరిగిన ఊరు ఇడిసి పోతిమి.. ప్రాజెక్టుకు మన ఊరిపేరన్నా పెట్టకపోయిరి.. మనది కాని కాడికి పోయి తిప్పలు పడవడితిమి.. ఏం చేద్దాం.. మన రాతే ఇంత ఉంది'.. ఇదీ అనంతగిరి నిర్వాసితుల ఆవేదన. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో నాలుగేళ్లుగా నీట మునిగిన అనంతగిరి గ్రామం కనిపిస్తోంది. గ్రామంలోని శిథిలాలను ఈ ఊరి నిర్వాసితులు వచ్చి చూసి ఆ ప్రాంతంతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 5: అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో మునిగిన అనంతగిరి గ్రామంలోని శిథిలమైన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఊరితో తమకున్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకొని గ్రామస్థులు శిథిలమైన తమ ఇళ్లను చూస్తూ తమ బాధను దిగమింగుకుటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 10వ ప్యాకేజీలో భాగంగా అనంతగిరి గ్రామసమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. తాము గ్రామాన్ని విడిచిపెట్టలేమని, ప్రాజెక్టు డిజైన్ మార్చాలని గ్రామస్తులు చేసిన పోరాటాలు పనిచేయలేదు. అనంతగిరి గ్రామానికి చెందిన 2,500 ఎకరాల భూమిని సేకరించారు. ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యేనాటికి ఉన్న 837 ఇళ్లు, 1,135 కుటుంబాలకు పరిహారం ఇచ్చి గ్రామాన్ని ఖాళీ చేయించారు. 2020లో ప్రాజెక్టును ప్రారంభించి దానికి అన్నపూర్ణ రిజర్వాయర్‌గా నామకరణం చేశారు. తాము సర్వస్వాన్ని కోల్పోయినందున కనీసం తమ గ్రామం పేరు అయినా అనంతగిరి ప్రాజెక్టుకు పెట్టాలని గ్రామస్థులు కోరారు. లేకపోతే తమ గ్రామంలోని ముత్యాల పోచమ్మ పేరు పెట్టాలని వేడుకున్నారు. ప్రభుత్వం వారి వినతులను పట్టించుకోలేదు.


నీరు తగ్గడంతో తేలిన ఇళ్ల శిథిలాలు

● నాలుగు సంవత్సరాలకు తేలిన గ్రామం

అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించిన నాలుగు సంవత్సరాలు నిండుకుండలా ఉండేది. ప్రస్తుతం ఒక టీఎంసీ నీరు మాత్రమే ఉండటంతో శిథిలమైన ఇళ్ళు కనిపిస్తున్నాయి. తమ ఇల్లు ఎక్కడ ఉందో గుర్తించి గ్రామస్తులు కుటీంబీకులతో కలిసి చూసి వస్తున్నారు. శిథిలమైన ఇంటి భవనాల నుంచి కొంతమంది స్టీల్‌ను తీసుకెళుతున్నారు. గతంలో గ్రామానికంతటికి ఆలంబనగా నిలిచిన కుమ్మరికుంట, కొత్తచెరువులు బోసిబోయి కనిపిస్తున్నాయి. గ్రామస్తులంతా ప్రతి రోజు మంచి చెడులు మాట్లాడుకునే పొట్లోల్ల చింత ఇప్పటికీ నిలబడే ఉంది. గ్రామపంచాయితీ కార్యాలయం, అంజనేయ స్వామి ఆలయం, ప్రభుత్వ పాఠశాల భవనాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి.


ప్రాజెక్టు నిర్మాణానికి ముందు అనంతగిరి గ్రామం (ఫైల్)

● సమస్యలు తీరలేదు

తమ పుట్టిన ఊరును విడిచిపెట్టినా తమ సమస్యలు మాత్రం తీరలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి కొంత మందికి పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. మరికొంత మంది న్యాయస్థానాలను ఆశ్రయించారు.


పాఠశాల భవనాలు

పుట్టిపెరిగిన ఊరును చూసి బాధను దిగమింగుకుంటున్నాం..



- కూనబోయిన శంబయ్య, అనంతగిరి

పుట్టిపెరిగిన ఊరి ప్రస్తుత పరిస్థితిని చూసి బాధను దిగమింగుకుంటన్నాం. గ్రామంలో అన్నిరకాల పనులు చేసుకునేవాళ్లం. అందరం పొట్లోల్ల చింత దగ్గర కలిసి మంచీ, చెడు మాట్లాడుకునేవాళ్లం. ఇప్పుడు కాలనీలో అలాంటి పరిస్థితి లేదు. ఊరుతేలిందని పిల్లలు తీసుకువస్తే వచ్చిన. కూలిన ఇంటిని చూస్తే ఎంతో బాధ అనిపిస్తోంది. 80 సంవత్సరాలు అనంతగిరి గ్రామంలోనే ఉన్నా. ముసలితనంలో ఊరికి దూరమైన.

ఊరు విడిచి ఎటుగాని వాళ్లం అయ్యాం



- వల్లంపట్ల రాజవ్వ, అనంతగిరి

ప్రభుత్వం ప్రాజెక్టు కట్టడంతో ఊరు విడిచి కాలనీకి పొయ్యి ఎటుగాని వాళ్లమయ్యాం. ఇన్నిరోజులు నీరు ఉండటంతో ఏమీ అనిపించలేదు. ఇండ్లు తేలిన తర్వాత వచ్చి చూస్తే ఎంతో బాధనిపిస్తోంది. పరులకు కూడా ఇటువంటి కష్టాలు రావద్దు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో నేడు విచారణ

● ఢిల్లీకి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5: సుప్రీంకోర్టులో మంగళవారం ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు జడ్జీల బెంచ్ ముందు వాదనలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్‌కుమార్, మానకొండూర్, జుక్కల్ ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తోట లక్ష్మికాంతరావు ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ నలుగురు వాదనలు వినిపించేందుకు అవసరమైన సమాచారంతో అడ్వకేట్లతో సహా ఢిల్లీకి వెళ్లారు. జనాభా దామాషా పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ జరుగాలనే అంశంపై చర్చిస్తారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 5: చోరీ కేసులో నిందితురాలికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ప్రవీణ్ సోమవారం తీర్పు ఇచ్చారు. ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌కి చెందిన జంగటి లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గంభీరావుపేటకు చెందిన పాటి సునీత మాయమాటలు చెప్పి బంగారు అభరణాలు దోచుకొని పరారైంది. ఈ ఘటనపై బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు పాటి సునీతను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందతురాలిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధించారు.

హుజూరాబాద్‌లో కోతుల బెడద

● ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్, ఫిబ్రవరి 5: హుజూరాబాద్ పట్టణంలో రోజు రోజుకు కోతుల బెడద ఎక్కువైంది. పది రోజుల క్రితం విద్యానగర్‌లో కోతులు ఒకరిని గాయపరచగా తాజాగా సోమవారం పట్టణంలోని తునికి సమ్మయ్య, ఆర్ లచ్చమ్మలను ఇంటి ముందు కోతులు దాడి చేశాయి. చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. హుజూరాబాద్‌లో వేలాది కోతులు రోడ్డు వెంట తిరుగుతున్నాయి. వీటిని పట్టించుకోవాల్సిన మున్సిపల్ పాలకవర్గం అటూ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా ప్రజలు కోతుల బెడదతో భయపడుతున్నారు. తలుపు తీసి ఉంటే ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందర వందర చేయడంతో పాటు దాడలు చేస్తున్నాయి. పిల్లలు, వృద్ధులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. రోడ్డుపైకి వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోతుల బెడద లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భక్త జనసంద్రంగా రాజన్న క్షేత్రం


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ పరిసరాలు


ఆలయ పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన భక్తుల వాహనాలు

వేములవాడ, ఫిబ్రవరి 5: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ప్రతినిత్యం వేలాది మంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నుండి సోమవారం రాత్రి వరకు సుమారు 80 వేలకు పైగా భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము నుండి ప్రారంభమైన శ్రీ స్వామివారి దర్శనం రాత్రంతా కొనసాగగా సోమవారం రాత్రి వరకు భక్తులు నిరంతరాయంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. సుమారు నాలుగు నుండి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కోడె మొక్కు చెల్లింపు సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటలకు పైగా నిరీక్షించి ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రుద్రంగి ఫిబ్రవరి 5: మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన సుద్దాల భూమయ్య కొద్ది రోజులుగా కొండగట్టులో ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు భూమయ్య కూతురుకు సమాచారం అందించారు. దీంతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో చోరీ సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై అశోక్ తెలిపారు.

తాళాలు పగులగొట్టి

'డబుల్' ఇళ్లలోకి ప్రవేశం


డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 5: డబుల్‌బెడ్‌రూంల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ ద్వారా జరిగినా అప్పగించక పోవడంతో పెద్దలింగాపూర్ గ్రామంలో లబ్ధిదారులు తాళాలు పగలగొట్టి గృహప్రవేశం చేశారు. ప్రభుత్వం డబుల్‌బెడ్ రూంల నిర్మాణంలో భాగంగా పెద్దలింగాపూర్ గ్రామంలో 40 డబుల్‌బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గ్రామ సభ ద్వారా 16 నెలల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం మారడం గ్రామంలో మరోసారి గ్రామ సభ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందనే వదంతులు వ్యాపించడంతో లబ్ధిదారులు సోమవారం ఉదయం తాళాలు పగటగొట్టి గృహప్రవేశాలు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జావెద్‌అహమ్మద్, ఎస్సై సుధాకర్, ఆర్ఐ షఫీలు డబుల్‌బెడ్‌రూం వద్దకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. త్వరలోనే ప్రొసీడింగ్‌లు అందిస్తామని, అప్పటి వరకు డబుల్‌బెడ్‌రూంల నుంచి వెళ్లిపోవాలని లబ్ధిదారులకు అధికారులు సూచించారు.

మెడపై కత్తి పెట్టి బంగారు ఆభరణాలు అపహరణ

కోనరావుపేట, జనవరి 5 : ఓ మహిళ మెడపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తి పెట్టి మూడు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దొంగల కోసం డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన నంది సిద్ధవ్వ సోమవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల ప్రాంతంలో బాత్రూం కోసం బయటకు వచ్చింది. అక్కడే ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అకస్మాత్తుగా ఆమె మీద పడి ఒకరు గొంతుపై కత్తి పెట్టి నోరు మూసి మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవులకున్న కమ్మలు అపహరించారు. అరుస్తే చంపేస్తామని బెదిరించారు. సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు రెండు లక్షల విలువ గలవి దొంగిలించి పరారయ్యారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, వేములవాడ డిఎస్‌పి నాగేంద్రచారి, చందుర్తి సిఐ కిరణ్ కుమార్, కోనరావుపేట ఎస్సై అంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్కాడ్‌తో గాలింపు చేపట్టారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కొంతమంది యువకులు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారని మంగళపల్లిలో జరిగిన చోరీని త్వరలోనే చేధిస్తామని గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో దొంగతనం జరిగిన తీరును పరిశీలించి మాటాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేసవిలో దొంగతనం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.


వివరాలు సేకరిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి5: తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లో బీఆర్‌ఎస్వీ నాయకులు సోమవారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బేషరతుగా సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, భూక్య తిరుపతి నాయక్, కేంసారం తిరుపతి, ద్యావ మధుసూదన్ రెడ్డి, వేణుయాదవ్, ప్రదీప్, రాజునాయక్, రమేష్, విజేందర్, అనిల్, స్వామి, ప్రశాంత్, సాయికృష్ణ ఓంకార్ మహేష్, మల్లికార్జున్, విప్లవ్, సుదర్శన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: అలుగునూర్‌లోని కరీంనగర్ - వరంగల్ రోడ్డుపై బీఆర్‌ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసిలు, ఎంపిపిలు, మండల అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 5 : నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఇందిరాచౌక్ వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్ఎస్ నాయకుల మీద చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అబ్దుల్ రెహమాన్, సయ్యద్ అఖిల్, కుర్ర పోచయ్య, దన్న సింగ్, దండి రవీందర్, లాయక్, పొరండ్ల రమేష్, మెతుకు కాంతయ్య, అస్తపురం రమేష్, పెద్దిగారి తిరుపతి, షేహెన్న, బషీర్, ముల్కల కవిత, మహాలక్ష్మి, దీకొండ శేఖర్, అజయ్, సిరాజొద్దిన్, మాసుంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంపై హర్షం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి5: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల కుల గణనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఏ.కిరణ్‌కుమార్ సోమవారం హర్షం వ్యక్తపరిచారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌లో బీసీ కులాల జనాభా గణన బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచించి, కుల గణన బిల్లును రూపొందించే బాధ్యతను వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగించిందన్నారు. అందుకు అనుసరించాల్సిన విధానాల అధ్యయనంతో బిల్లు రూపొంది బీసీలకు మేలు జరిగేలా చూడాలని కోరారు.

కరాటేలో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 5: ఇండోనేపాల్ కరాటే పోటీల్లో అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. సోమవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఇండోనేపాల్ కరాటే పోటీల్లో పాఠశాలకు చెందిన వంశవర్ధన్‌కు బంగారు పతకం, కాటాలో కాంస్యపతకం, ప్రణవి, గౌతమ్‌లకు వెపన్లో రజత పతకం, కటాలో కాంస్యం, సుదీక్ష్యకు కటాలో రజతం, కుమిటేలో రజత పతకాలు సాధించారు.

విశ్వబ్రాహ్మణ సొసైటీకి బడ్జెట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధి సంక్షేమ సమాఖ్యకు బడ్జెట్ విడుదల చేయాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తొవిటి సదానందచారి కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులు తీసుకొని ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 5: కొత్తపల్లి మండడలంలోని కమాన్‌పూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాపై కాంగ్రెస్ నాయకులు సిరిపురం నాగప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కమాన్‌పూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 137లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, మహ్మద్ అమేర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తాం

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి.ఫిబ్రవరి 5: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసదుపాయాలను మెరుగు పరుస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం చొప్పదండిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అయన భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసి మాచర్ల సౌజన్య, ఆసుపత్రి సమన్వయ అధికారి క్రిష్ణ ప్రసాద్,ఈఈ రవీందర్, వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పద్మాకర్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ముద్దం తిరుపతి గౌడ్, పురం రాజేశం, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత దళితబంధు డబ్బులు విడుదల చేయాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 5: హుజూరాబాద్ నియోజకవర్గంలో రెండో విడత దళితబంధు డబ్బులను లబ్ధిదారులకు విడుదల చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల పక్షాన పోరాడటానికి బీజేపీ సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండి దళితబంధు సాధనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బోరగాల సారయ్య, రావుల వేణు, వొడ్నాల విజయ్, తూర్పాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా ఖర్చు, సమయం ఆదా : ఏడీఏ సునీత



డ్రోన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 5: డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ చేస్తే ఖర్చు, సమయం ఆదా అవుతుందని హుజూరాబాద్ ఏడీఏ సునీత అన్నారు. సోమవారం మండలంలోని మడిపల్లి గ్రామంలో గల రైతు వేదికలో ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హజరైన ఏడీఏ మాట్లాడుతూ జిల్లాలో మొట్ట మొదటి సారిగా రైతుల సౌకర్యార్థం డ్రోన్ యంత్రాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. జమ్మికుంట ఆగ్రో రైతు సేవ కేంద్రం తరపు వారి నుంచి రైతులకు సేవలు ప్రారంబించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో పొలంపల్లి గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ పరుశురాము, ఇఫ్కో మేనేజర్ బాలాజీ, ఆగ్రో రైతు సేవ కేంద్రం బుర్ర మల్లికార్జున్, మాజీ ఎంపీపీ రాయమల్లు ఉన్నారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 5: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 94మంది రైతులు 756క్వింటాళ్ల విడి పత్తి, 15మంది రైతులు 31క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. గరిష్ఠ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించారు.

శిఖం భూమిలో ఉన్న పాలకేంద్రాన్ని స్వాధీనం చేసుకోవాలి

గన్నేరువరం, ఫిబ్రవరి 5: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సర్వేనంబర్ 295లోని 11ఎకరాల విస్తీర్ణంలోని దేవుని చెరువు శిఖం భూమిలో కొనసాగుతున్న ప్రైవేట్ వ్యక్తుల పాలకేంద్రాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల సీపీఐ నాయకులు తహశీల్దారు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం పట్టించుకుని శిఖం భూమికి హద్దులను నిర్ణయించాలని, పాలకేంద్రాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయంగా మార్చాలని డిమాండ్ చేశారు. తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఫైముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంకు బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాల్క సుమన్ కాదు... అతను కేసీఆర్ కుటుంబానికి బానిస సుమన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చెన్నూరులో అక్కడి ప్రజలు బాల్క సుమన్‌ను చెప్పుతో కొట్టినట్లు చేశారన్నారు. బాల్క సుమన్ భాష మార్చుకోనట్లయితే తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. సుమన్ ఎంపీ సీటు కోసం ఆశపడుతున్నాడని, అందుకే ఆయన బానిసలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు.

సంస్కారం లేకుండా మాట్లాడితే తరిమి కొడతాం

-మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సంస్కారం లేకుండా మాట్లాడితే తరిమి కొడతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా దళిత డిప్యూటీ సీఎం రాజయ్యను భర్తరఫ్ చేస్తే, కొప్పుల ఈశ్వర్‌పై అనుచితంగా వ్యవహరిస్తే దళితుడిగా మాట్లాడావా అని బాల్క సుమన్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ ఇద్దరు మాల సామాజిక వర్గానికి మంత్రి పదవులు, ఒకరికి ప్రభుత్వ విప్ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శించే ముందు సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. నీ అవినీతిపై విజిలెన్సు విచారణ జరిపించి జైలుకు పంపిస్తామని బాల్క సుమన్‌ను డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హెచ్చరించారు.

చేతి వృత్తుల వారికి చేయూత

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 5: చేతివృత్తుల వారికి ఆర్థిక చేయూత అందించేందుకే విశ్వకర్మ యోజన పథకం అందుబాటులో ఉందని కొత్తపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చింతకుంట గ్రామంలో విశ్వకర్మ యోజన పథకం ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తుల వారికి ఆర్థిక చేయూత కోసం ఈ పథకం రూపొందించిందన్నారు. కేంద్ర కార్మిక శాఖకు చెందిన ఈశ్రామ్ కార్డు కలిగిన అందరు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో చింతకుంట ప్రత్యేకాధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, పట్టెం లక్ష్మీనారాయణ, సిఐఎసిసి విఎల్ఈ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వేముల అనిల్‌కుమార్, జిట్టవేని రేణు, సదానందం, బొల్లవేని ప్రశాంత్ వెంకటరమణ, శ్రవణ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5: ఆరోగ్యశ్రీ పేషంట్లకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి సూచించారు. సోమవారం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీటీ స్కాన్ మిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పేషంట్లకు కావలసిన వైద్య సేవలతోపాటు సౌకర్యాలు కల్పించాలన్నారు. మెట్రో నగరాల్లో ఉండే అత్యాధునిక సీటీ స్కాన్ మిషన్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం పేషంట్లకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ వినయ్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సదాశివ్‌బితమగొండ, డాక్టర్ అన్వేష్, డాక్టర్ రాంచంద్రం, డాక్టర్ తాహ, డాక్టర్ రవి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబ్బులు వసూలుపై చర్చకు సిద్ధం'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5: ప్రతి అర్చకుడి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని నిట్టూరి సతీష్‌శర్మ, జక్కాపూర్ నారాయణస్వామి, అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేందర్‌శర్మ అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని రాజన్న సిరిసిల్ల దూపదీప నైవేద్య అర్చక సంఘం ప్రతినిధులు సవాలు విసిరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు మరంగాంటి కొండమాచార్యులు, జిల్లా అధ్యక్షుడు వేగ్గళం సంతోష్‌శాస్త్రీ, ప్రధాన కార్యదర్శి పరాంకుశం రమేశ్, జిల్లా గౌరవాధ్యక్షుడు గొంగళ్ళ రవికుమార్, గొంగళ్ళ ఉమాశంకర్, లక్ష్మీకాంతశర్మ, శ్రీనివాస్, విద్యాసాగర్, శివప్రసాద్, పురుషోత్తం పాల్గొన్నారు.

కరాటేలో సెయింట్ జార్జ్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి5: నగరంలోని సెయింట్‌జార్జ్ (సిబిఎస్‌ఈ) విద్యార్థులు ఇండోనేపాల్ కరాటే పోటీల్లో పతకాలు సాధించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన ఎస్‌సుహాష్, వి అభిరానందన్, ఎం సాయిచరణ్, నటరాజ్, వర్షిత్, అద్వైత్, హృషికేష్, విశాల్, అతిరద్, ప్రణీత్, అనన్య, జయ్‌దిత్య, రిత్విక్, శ్రీతన్, అభిరణందన్‌లను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినదించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భార్గవ్, వి నిరంజన్ పాల్గొన్నారు.

ఎస్‌యూలో అవినీతిపై విచారణ జరిపించాలి



ఎస్‌యూ ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 5: శాతవాహన యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ముందు ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో నిత్యం ఏదో ఒక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. టెండర్ లేని ప్రైవేట్ ఏజెన్సీకి యూనివర్సిటీకి సంబంధించిన చెల్లింపులపై విచారణ జరిపించాలని యూనివర్సిటీ ఫార్మసి కళాశాల భూములు తరుచుగా కబ్జా అవుతున్నాయని, భూముల రక్షణ కోసం భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలని అక్రమ పదోన్నతులు, యూనివర్సిటీలో అక్రమ నియామకాలపై, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాలపై విచారణ చేపట్టాలన్నారు. యూనివర్సిటీలో విద్య ప్రమాణాల పెంపు కోసం యూనివర్సిటీ అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మామిడిపల్లి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము, నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి ఉన్నారు.

నేడు రంగాపూర్‌లో 'గావ్ చలో'

-పాల్గొననున్న ఎంపీ బండి సంజయ్ -ఇంటింటికీ రాముడి చిత్రపటాల పంపిణీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5: హుజూరాబాద్ నియోజకవర్గంలోని రంగాపూర్ గ్రామంలో సోమవారం గావ్ చలో కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్ పాల్గొననున్నారు. ఆ గ్రామమంతా పర్యటించడంతోపాటు స్థానికులతో మమేకం కానున్నారు. పార్టీకి సంబంధించి సామాన్య కార్యకర్త నివాసంలో స్థానికులతో కలిసి భోజనం చేయనున్నారు. దీంతోపాటు ఆ గ్రామంలోనే రాత్రి బస చేయనున్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఆ గ్రామానికి ఏం చేసిందనే అంశంతోపాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటి పరిష్కార మార్గాలపై స్థానికులతో చర్చించనున్నారు. రంగాపూర్ గ్రామంలో ఇంటింటికీ అయోధ్య రాముడి చిత్రపటాలను పంపిణీ చేయనున్నారు.

ఎంపీ తన పార్లమెంట్ పరిధిలోని 4 లక్షల కుటుంబాలకు అయోధ్య రామయ్య చిత్రపటాన్ని పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే లక్షకుపైగా రామయ్య చిత్రపటాలు సిద్ధం కావడంతో ఇంటింటికీ చేరవేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి.

విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 5: భువనగిరి హస్టల్ విద్యార్థుల మృతికి కారకులైన నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గీతభవన్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ విష్ణు మాట్లాడుతూ భువనగిరిలో పదోవ తరగతి విద్యార్థుల మృతిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. విద్యార్థుల వసతి గృహంలోకి ఆటో డ్రైవర్లు ఎలా ప్రవేశిస్తారుఅని ప్రశ్నించారు. ఆటో డ్రవర్లను వార్డెన్ వసతి గృహల్లో ఎలా అనుమతించరు. పదే పదే పిర్యాదు చేసిన వార్డెన్ ఎందుకు చర్యలు తీసుకోలేదు అన్నారు. వసతి గృహల్లో భద్రత విఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. దీనిపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు.

కార్యక్రమంలో నగర కార్యదర్శి బామాండ్ల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నితీష్, మధు జోనల్ ఇన్చార్జులు సాయి చారీ, సిద్దు, నగర సంయుక్త కార్యదర్శులు వంశీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఇల్లందకుంటలో మాట్లాడుతున్న ఎంపీపీ పావని



శంకరపట్నంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరోజన

ఇల్లందకుంట, ఫిబ్రవరి 5: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రత్యేకాధికారులు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ సరిగొమ్ముల పావని-వెంకటేష్ అన్నారు. సోమవారం ఎంపీపీ పావని అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పావని మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందన్నారు. రాబోయే వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో తీగల శంకర్, తహసీల్దార్ రాణి, ఏవో గుర్రం రజిత, ఎంపీటీసీలు మోటపోతుల అయిలయ్య, తెడ్ల ఓదెలు, ఎక్కటి సంజీవరెడ్డి, దాంసాని విజయ-కుమార్, దరుగుల రమ, ఎంఈవో శ్రీనివాస్, ఏపీఎం రమాదేవి, పీహెచ్‌సీ వైద్యుడు తులసీదాస్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

శంకరపట్నం : మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఉమ్మెంతల సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సదాసీదాగా సాగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు గ్రామాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీడీవో శ్రీవాణి గ్రామాలాభివృద్ధిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రత్యేకాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో బషీరుద్దీన్, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మానకొండూర్, ఫిబ్రవరి 5 : తమ వ్యవసాయ భూముల నుంచి తీసిన మట్టికి డబ్బులు చెల్లించడం లేదని గట్టుదుద్దెనపల్లిలో రైతులు సోమవారం మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. శంకరపట్నం మండలంలోని అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతుల భూములలోని మట్టిని జాతీయ రహదారి విస్తరణ పనుల నిమిత్తం సదరు కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. మట్టిని తీసుకెళ్లిన 45 రోజులకొకసారి డబ్బులు చెల్లించాలి. అయితే నాలుగు నెలలు గడిచిన సదరు కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించక పోవడంతో ఆగ్రహించిన రైతులు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. రైతులందరికీ రెండు మూడు రోజులలో డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమింప చేశారు.

మైలారం జాతర ఏర్పాట్ల పరిశీలన

గన్నేరువరం, ఫిబ్రవరి 5: మండలంలోని మైలారం గ్రామంలో మానేరు డ్యాం ఒడ్డున ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను జాతర కమిటీ సభ్యులు సోమవారం పరిశీలించారు. సమ్మక్క గద్దెల వద్ద అభివృద్ధి పనులకు స్థానిక మాజీ సర్పంచ్ దుడ్డు రేణుకమల్లేశం రూ.30,016, సింగిరెడ్డి రమణారెడ్డి రూ.5016లను విరాళంగా అందజేశారు. జాతర కమిటీ అధ్యక్షుడు విలాసాగరం రామచంద్రం, మైసంపల్లి తిరుపతి, వొడ్నాల నర్సయ్య, నాగరాజు, శ్రీనివాస్ ఉన్నారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నంలో నిర్వహించే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర వాల్ పోస్టర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ఎల్ఎండీ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో మారుతిరావు, చైర్మన్ గుర్రం స్వామి గౌడ్, ధర్మకర్తలు గుర్రం శ్రీనివాస్, గుర్రం వెంకటేశం, బుచ్చయ్య, బొబ్బల శ్రీనివాస్, బొజ్జ రవి పాల్గొన్నారు.

'అబద్ధాల పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం'



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

తిమ్మాపూర్, ఫిబ్రవరి5: అబద్ధాల పునాది మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. అలుగునూర్‌లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో 1,06,083 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే శాసనసభ్యులతో పాటు మంత్రులను, ముఖ్యమంత్రిని నిలదీద్దాం అని పిలుపునిచ్చారు. ఎవ్వరూ నిరుత్సాహపడద్దని బీఆర్ఎస్ శ్రేణులకు భరోసా కల్పించారు. కరీంనగర్‌వాసుల చిరకాల వాంఛ రైల్వే లైన్‌ను తాను ఎంపీగా గెలిచిన తరువాత తీర్చడం జరిగిందన్నారు. స్మార్ట్‌సిటీతో పాటు రహ దారులకు నిధులు తీసుకువచ్చానని, ఎంపిగా ఉన్న బండి సంజయ్ 5సంవత్సరాలుగా 5రూపాయల పని కూడా చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాక ముందే ప్రజల్లో మార్పు వచ్చిందని, వంద రోజుల్లో కాంగ్రెస్ భవితవ్యం తేలిపోతుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. కేసీఆర్ లేని తెలంగాణ ఎవరూ ఊహించుకోవడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనమల్ల విజయ గణపతి, కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావుల రమేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్దం వేణు, నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటిసిలు, ఎంపిపిలు, మండల అధ్యక్షులు, ఇతర నాయకులు, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5 : మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి జరుపగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. నలుగురు వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. దొరికిన వ్యక్తుల నుంచి రూ.17,600ల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.ఎస్ఐ సాంబయ్య, హెడ్ కానిస్టేబుల్ ఫసియుద్దీన్, కానిస్టేబుళ్ల అవినాష్, ప్రసాద్‌లు చాకచాక్యంగా పేకాట శిబిరంపై దాడి జరిపి పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 5: నగరంలో మంగళవారం ఉదయం 8:30నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేనీ నరేందర్ తెలిపారు. మెహర్‌నగర్, కిరణ్ నగర్, హౌసింగ్ బోర్డ్ ఫీడర్లలో వంటి ప్రభావిత ప్రాంతాలు మెహర్‌నగర్, సీతారాంపూర్ పార్ట్ ఏరియా, కిసాన్‌నగర్, దుర్గమ్మగడ్డ, ఖాన్‌పురా, హుస్సేనిపురా, హౌసింగ్ బోర్డ్ వీట్స్ కళాశాల ప్రాంతం, వరాహస్వామి ఆలయ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'గృహజ్యోతి'కి సమాచారం అందించాలి

గణేష్‌నగర్, ఫిబ్రవరి 5: ప్రజాపాలనతో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు స్పాట్ బిల్లింగ్‌కు వచ్చే వారికి సమాచారం అందించాలని ఏఈ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతి అర్హులు తమ ఇంటి వద్దకు వచ్చే బిల్లర్‌లకు ఆహారభద్రత కార్డునెంబర్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు మీటర్ వద్ద ఉంచి సహకరించాలని కోరారు.

రేకుర్తి జాతరకు రెండు టెండర్లు ఖరారు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 5: రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా సోమవారం మూడు అంశాలైన కొబ్బరికాయల అమ్మకాలు, కొబ్బరిక ముక్కల ప్రోగు, లడ్డూ, పులిహోరా అమ్మకాలకు టెండర్లు నిర్వహించారు. ఇందులో రెండు అంశాలకు టెండర్లు ఖరారు కాగా కొబ్బరికాయల అమ్మకాలకు టెండరు వాయిదా పడింది. కొబ్బరికాయల అమ్మకాలతోపాటు జాతర ప్రాంగణంలో తడకల పందిర్లు వేయుటకుగాను బుధవారం ఉదయం 11 గంటల నుంచి కోర్టు వద్ద గల దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించనున్నట్లు జాతర అధికారి ఎండపెల్లి మారుతి తెలిపారు. ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు. సోమవారం జరిగిన టెండర్లలో జాతర అధికారి ఎ మారుతితోపాటు వ్యవస్థాపక చైర్మన్ పిట్టల శ్రీనివాస్, క్లర్క్ గుడికాడి శ్రీనివాస్, దేవాదాయశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి5: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన కళాశాల క్యాంటీన్‌ను లీజు పద్ధతిలో నిర్వహించుటకై ఆసక్తికర వ్యక్తుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల వ్యక్తులు 7న సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులను కార్యాలయంలో అంద చేయవలసిందిగా తెలియజేశారు.

కేన్సర్‌పై అవగాహన

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి5: కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘీకసంక్షేమ గురుకుల కళాశాలలో కేన్సర్‌పై ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బి మాధవి సన్మానించారు. ప్రపంచ కేనర్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ సమత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యకమం నిర్వహించారు.

వేతన సవరణ బకాయిలు అందించాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 5: ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన 83 నెలల వేతన సవరణ బకాయిలు వెంటనే విడుదలచేయాలని తెలంగాణ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జక్క పుల్లయ్య డిమాండ్‌చేశారు. టిఎస్ ఆర్టీసీలో ఉద్యోగులకు 83 నెలల వేతన సవ రణ, వివిధరకాల బకాయిలు చెల్లించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందే బకాయిలు చెల్లించే విధంగా దుకోవాలని కోరారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 3,4 తేదీల్లో జరిగిన ఇండో నేపాల్ కరాటే పోటీల్లో సీఎస్‌కేఐ క్రీడాకారునికి గ్రాండ్ చాంపియన్‌షిప్ లభించింది. 14 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల విభాగంలో వివిధ అంశాల్లో పోటీ పడిన కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా అకాడమి(సీఎస్‌కేఐ) క్రీడాకారుడు అబ్దుల్ రహ్మాన్ విశేష ప్రతిభచాటి గ్రాండా చాంపియన్‌షిప్ సాధించాడని సీఎస్‌కేఐ ఇండియా ఛీఫ్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు శ్రీ దుర్గా భవాని దేవాలయంలో ఈ నెల 9 నుండి శైశిర నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్న ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ తెలిపారు. సోమవారం నవరాత్రోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

●వీణవంక: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

- వీణవంక మండల కేంద్రానికి చెందిన గెల్లు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అశోక్‌తో పదో తరగతి చదివిన స్నేహితులు తమ వంతుగా పిల్లలకు 35,000 వేల రూపాయల ఆర్థికసాయం అందించారు.

- వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన సంగ అశోక్ ట్రాక్టర్‌లో మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

● జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన ఆర్ఎంపి మాంగంటి శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృత్యువాత పడ్డాడు. సోమవారం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మండ ల అధ్యక్షులు పైడిపల్లి భీమన్న ఆధ్వర్యంలో మృతుడి భార్యవనితకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

● ఇల్లందకుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితులందరికీ రెండో విడత దళితబంధు నిధులు పూర్తిగా విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి మాదాసు మహేందర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

● ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామా నికి చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ గూడేపు ఓదె లు, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, రైతు సమన్వ య సమితి కన్వీనర్ రమేష్ తదితరులున్నారు.

● తిమ్మాపూర్ : మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల శ్రీ మృత్యుంజయ మహాదేవాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు మార్చి 10న జరిగే వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలపై సమావేశంలో పాల్గొన్నారు

●సైదాపూర్: 10 తరగతి విద్యార్థులు భయం వీడి బాగా చదివి ధైర్యంగా పరీక్షలు రాస్తే విజయం మీదేనని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బొట్ల రామస్వామి విద్యార్థులకు సూచించారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలపది విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

● హుజూరాబాద్‌రూరల్: చిన్నపాపయ్యపల్లె గ్రామా నికి చెందిన బీజేవైఎం నాయకుడు నరేడ్ల ప్రవీణ్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హన్మకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీగా నియా మకమయ్యారు.

● గంగాధర: విద్యార్థులతో దాగి ఉన్న ప్రతిభ సామర్థ్యాలను వెలికి తీసి వారిని ఉన్నతంగా తయాం చేయా లని మైనారిటీ రీజనల్ కో ఆర్డినేటర్ సురేష్ అన్నారు. సోమవారం చొప్పదండి నియోజకవర్గ మైనారిటీ గురు కుల బాలికల పాఠశాలలో సమావేశంలో మాట్లాడారు.

● గన్నేరువరం: ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారా యణ గెలుపొందడంపై మండలంలోని గన్నేరువరం, చొక్కారావుపల్లి గ్రామాల యువత అయోధ్యకు తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.